

టికెట్ ఫైట్

- పాలమూరులో బీజేపీ, నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ నాయకుల పోటాపోటీ
- ఎవరికి వారే తాము బరిలో ఉన్నట్లు ప్రకటన
- పార్టీ ఎమ్మెల్యేల సహకారం కోరుతున్న ఆశావహులు
- వంశీచంద్ రెడ్డి పాదయాత్ర, మల్లు రవి ప్రజాకృతజ్ఞత సభలు
- బీజేపీలో డీకే అరుణ, జితేందర్ రెడ్డి, శాంతకుమార్ పోటాపోటీ



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో టికెట్ కోసం ఆశావహుల మధ్య ఫైట్ నడుస్తోంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడంతో జోష్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. మెజారిటీ లోక్‌సభ సీట్లను కైవసం చేసుకోవాలని ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు దేశంలో ఎక్కువ రాష్ట్రాల్లో అధికారంలో ఉండటం, మోదీ చరిష్మాతో ఓట్లు పడతాయనే నమ్మకం, మొన్నటి రామమందిరం ప్రారంభంతో కొంత ఓటు బ్యాంకు పోలరైజేషన్ కావడంతో రాష్ట్రంలో కూడా ఎక్కువ సీట్లు గెలుచుకోవాలని బీజేపీ ఆశిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో చతికలబడిన బీఆర్‌ఎస్ నుంచి ఏ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎవరు పోటీ చేస్తారనే విషయాలు మాత్రం బయటకు రావడం లేదు. ఊహాగానాల మధ్య పేర్లు వినిపిస్తున్నప్పటికీ.. తామే పోటీలో ఉంటామని చెప్పే ధైర్యాన్ని ఆ పార్టీ నాయకులు బహిరంగం చేయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో పార్టీ టికెట్ కోసం భారీగా పోటీ నెలకొంది. గత ఎన్నికల్లో రెండు స్థానాలకు రెండు బీఆర్‌ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. నాగర్‌కర్నూల్ రిజర్వ్ నియోజకవర్గం నుంచి పోతుగంటి రాములు, మహబూబ్‌నగర్ నుంచి మన్నె శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే ఈ సారి జరుగబోయే ఎన్నికల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ టికెట్ కోసం ఎక్కువ మంది నాయకులు పోటీపడుతుండగా, నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ టికెట్ కోసం పోటీ అధికంగా ఉందని చెప్పొచ్చు. రెండు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ టికెట్ కోసం మాత్రం ఇప్పటివరకు ఎవరి పేర్లు బయటకు రావడం లేదు. ఆయా పార్టీల్లో టికెట్లు ఆశిస్తున్న వారు ఎవరికి వారే తాము పోటీలో ఉన్నట్లు ప్రకటనలు చేసుకుంటుండగా.. పార్టీల అధిష్ఠానాలు మాత్రం ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు. ఎన్నికలు సమీపించిన తర్వాత మాత్రమే స్పష్టత వచ్చే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉంటే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పలు జంపింగ్‌లు కూడా ఉంటాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఎంపీ టికెట్ల కోసమో లేదంటే ఇంకేదైనా పనుల కోసమో చాలా మంది నాయకులు గడప దాటే అవకాశం ఉందని తెలుస్తోంది.



మల్లురవి



మందా జగన్నాథ్



సంపత్ కుమార్



జితేందర్‌రెడ్డి



డీకే అరుణ



శాంతకుమార్



వంశీచంద్‌రెడ్డి

పోటాపోటీ ప్రకటనలు..

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం మొదటి నుంచీ ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం. ఈ నియోజకవర్గంలో టికెట్ కోసం కాంగ్రెస్ నాయకుల మధ్య పోటీ నెలకొంది. 2014లో ఈ నియోజకవర్గంలో నుంచి దివంగత నంది ఎల్లయ్య గెలుపొందగా, ఆ తర్వాత 2019లో జరిగిన ఎన్నికల్లో మొదటిసారి ఈ పార్లమెంట్‌పై గులాబీ జెండా ఎగిరింది. ఆ ఎన్నికల్లో ప్రస్తుత ఎంపీ పోతుగంటి రాములు గెలుపొందారు. ఒకసారి ఇక్కడి నుంచి ఎంపీగా గెలిచిన మల్లు రవి.. ఆ తర్వాత ఓటమి చెందారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం ఆయన కీలక పాత్ర పోషించారు. పార్టీలో చేరికలు, గెలుపు గుర్రాలకు టికెట్లు ఇప్పించడం వంటివి దగ్గరుండి చూసుకున్నారు. ఆ సమయంలోనే మల్లు రవి పార్లమెంట్ అభ్యర్థిగా ఉంటారని ప్రచారం జరిగింది. కొద్దిరోజుల క్రితం ఆయనకు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి పదవి రావడంతో ఎంపీకి పోటీ చేస్తారా? లేదా? అనే చర్చ వచ్చింది. వాటికి చెక్ పెడుతూ వనపర్తి, గద్వాలలో నిర్వహించిన ప్రజా కృతజ్ఞత సభల్లో మల్లు రవి తానే అభ్యర్థిగా ఉంటానని ప్రకటించారు. పోటీ చేయడానికి తన పదవి అడ్డంకిగా మారితే రాజీనామా చేస్తానని కూడా ప్రకటించారు. ఆయా జిల్లాల కాంగ్రెస్ కమిటీలు కూడా మల్లు రవికి అనుకూలంగా తీర్మానాలు చేస్తున్నాయి. అలాగే అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ డాక్టర్ మందా జగన్నాథ్ కూడా.. తనకు పార్టీ హామీ ఇచ్చిందని, పార్టీ ఆదేశిస్తే పోటీలో ఉంటానని ఇప్పటికే ప్రకటించారు. తన ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే నియోజకవర్గ పరిధిలో అలంపూర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి, ఓటమి చెందిన డాక్టర్ ఎస్ఏ సంపత్‌కుమార్ కూడా టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఏఐసీసీ కార్యదర్శిగా ఉండటం, పార్టీలో పట్టు ఉండటంతో ఆయన కూడా బలమైన పోటీదారుగా ఉన్నారు. అయితే రిజర్వ్ నియోజకవర్గం కావడంతో సామాజిక వర్గాల వారీగా ఓట్ల లెక్కింపు చేస్తున్నారు. మల్లు రవి ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన వారు. కాగా, ఇక్కడ మాదిగల ఓట్లు ఎక్కువగా ఉంటాయని, గతంలో మల్లు రవి ఓటమి చెందడానికి మాదిగల ఓట్లు కీలకమయ్యాయనే అంశాన్ని పోటీదారులు ముందుకు తెస్తున్నారు. ఈ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులెవరు? పాత అభ్యర్థులకే టికెట్లు ఇస్తారా? లేక కొత్త అభ్యర్థులకు అవకాశం ఇస్తారా? అనేది తేలాల్సి ఉంది.

అక్కడ త్రిముఖ పోరు..

మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో 2009 వరకు కాంగ్రెస్ పార్టీ ఏడుసార్లు విజయం సాధించగా.. బీజేపీ ఒకసారి, బీఆర్‌ఎస్ మూడుసార్లు, జనతాదల్ ఒకసారి, జనతా పార్టీ ఒకసారి, తెలంగాణ ప్రజల సమితి ఒకసారి విజయం సాధించాయి. ఈ టికెట్ కోసం ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నుంచి సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి పోటీలో ఉండగా, మరొకరు కూడా టికెట్ తనకు ఇస్తే పార్టీలో జాయిన్ అవుతానని చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. వంశీచంద్‌రెడ్డి భారత్‌జోడో న్యాయ యాత్ర స్ఫూర్తితో పాలమూరు న్యాయ యాత్రను ప్రారంభించారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పాదయాత్ర చేస్తున్నారు. ఇక ఇక్కడ బీజేపీ టికెట్ కోసం మాత్రం త్రిముఖ ఫైట్ నెలకొందని చెప్పొచ్చు. గత ఎన్నికల్లో పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఈసారి కూడా బరిలో ఉండేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. అలాగే 2019 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఆశించి, దక్కకపోవడంతో పార్టీ మారిన మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి కూడా తాను పోటీలో ఉంటున్నట్లు ప్రకటించారు. గతంలో ఈ పార్లమెంట్ నుంచి బీజేపీ అభ్యర్థిగా జితేందర్‌రెడ్డి ఒకసారి గెలుపొందారు. అలాగే ఇప్పటికే చాలాసార్లు బీజేపీ తరఫున టికెట్ ఆశించి.. భంగపడిన పార్టీ విధేయుడు శాంతకుమార్ కూడా టికెట్ ఆశిస్తున్నారు. పార్టీలో మొదటి నుంచి పట్టు ఉన్నప్పటికీ.. ఆయనకు అవకాశం దక్కలేదు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా తాను అభ్యర్థిగా బరిలో ఉండాలని ఆశిస్తున్నారు. అయితే ఎవరి ప్రయత్నాలు ఫలిస్తాయో చెప్పలేని పరిస్థితి ఉంది. బీజేపీపై ఉన్న అభిమానం, మోదీ చరిష్మాపై ఉన్న నమ్మకంతో ఈ పార్లమెంట్ పరిధిలో బీజేపీ టికెట్‌ను ఎక్కువ మంది ఆశిస్తున్నారు.

విద్యుత్ శాఖ ఉలికిపాటు

- రైతుల విద్యుత్ కనెక్షన్‌ల తనిఖీలపై సీఎం ఆగ్రహం
- మహబూబ్‌నగర్ ఎస్ఈ ఎన్ శ్రీరామమూర్తిపై బదిలీ వేటు



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవనం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 2: పాలమూరు విద్యుత్ శాఖ ఉలిక్కిపడింది. ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాలో విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారుల్లో తీవ్ర కలవరం నెలకొంది. రైతుల వ్యవసాయ కనెక్షన్‌లను తనిఖీ చేయడంపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించడంతో పాటు ఓ ఉన్నతాధికారిని సస్పెండ్ చేసింది. మరో అధికారిని బదిలీ చేయడంతో విద్యుత్ శాఖలో అంతా గప్‌చుప్ అయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు వ్యవసాయ కనెక్షన్‌లను వ్యవసాయ పనులకు కాకుండా ఇతర పనులకు వినియోగిస్తున్నారనే అంశంపై విద్యుత్ అధికారులు తనిఖీలకు శ్రీకారం చుట్టారు. విషయం కాస్త ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని రాష్ట్ర స్థాయిలో డిస్కమ్ డైరెక్టర్‌ను సస్పెండ్ చేసి, మహబూబ్‌నగర్ ఎస్ఈ శ్రీరామమూర్తిని బదిలీ చేసింది.

అసలేం జరిగింది?

హైదరాబాద్ శివారు చుట్టుపక్కల వ్యవసాయ బోర్లను వ్యవసాయానికి కాకుండా ఇతర అవసరాలకు అంటే ఫాంహౌస్‌లు, పరిశ్రమలు, వెంచర్లులకు వినియోగిస్తుండటంతో వాటిని తనిఖీ చేసి, కేసులు నమోదు చేయాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. శివారు ప్రాంతాలలో చాలా వరకు వ్యవసాయం ఉండదు. వ్యవసాయానికి ఇస్తున్న ఉచిత విద్యుత్‌ను ఇతర పనులకు ఉపయోగించడం వల్ల దుర్వినియోగం అవుతోందని భాగ్యనగర శివారు ప్రాంతాలలో వ్యవసాయ కనెక్షన్‌లను తనిఖీలు చేయాలని అధికారులు చెప్పారు. అయితే.. వారి కింది స్థాయి అధికారులు జిల్లా స్థాయి విద్యుత్ అధికారుల సమావేశంలో అన్ని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లను తనిఖీలు చేయాలని చెప్పడంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఉన్నతాధికారులు సైతం జిల్లాల్లో వ్యవసాయ బోర్లను ఏయే అవసరాలకు వినియోగిస్తున్నారో తనిఖీలు చేయాలని ఆదేశాలిచ్చారు. పౌల్ట్రీఫామ్‌లు, ఇటుక బట్టీలు, ఫిల్టర్ ఇసుక తయారీకి వ్యవసాయ బోర్లను ఏమైనా వాడుతున్నారా? అన్న అంశంపై పలు జిల్లాల్లో విద్యుత్ అధికారులు తనిఖీలు చేయడం మొదలుపెట్టారు. మిగతా అధికారులంతా కిందిస్థాయి అధికారులకు నోటిమాటగా చెప్పగా.. మహబూబ్‌నగర్ ఎస్ఈ శ్రీరామమూర్తి మాత్రం అధికారుల వాట్సాప్ గ్రూప్‌లలో రాత పూర్వక మెసేజ్‌లు పెట్టి, ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది. ఈ మెసేజ్‌లు తిరిగి.. తిరిగి ప్రజా పాలనలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు చేరాయి. ఆయన సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఎస్ఈని వెంటనే అటాచ్ చేసి, విచారణ చేపట్టారు. సీఎండీ స్థాయిలో తాము జిల్లాలకు ఆదేశాలు ఇవ్వలేదని, కేవలం హైదరాబాద్ శివారు ప్రాంతాలలోని వ్యవసాయ బోర్లను మాత్రమే తనిఖీ చేయాలని చెప్పామని, కింది స్థాయిలో కమ్యూనికేషన్ గ్యాప్ వచ్చిందని వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మహబూబ్‌నగర్ ఎస్ఈ మూర్తిని బదిలీ చేసి, నారాయణపేట ఎస్ఈ విప్రభాకర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. విద్యుత్ అధికారులు తీసుకున్న నిర్ణయం వల్ల ప్రభుత్వానికే చెడ్డపేరు వస్తుందని ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించడంతో జిల్లా విద్యుత్ అధికారులను ఉలిక్కిపడేలా చేసింది. దాంతో విద్యుత్‌శాఖలో గప్‌చుప్ వాతావరణం ఏర్పడింది. ఎవరిని కదిలించినా తమను ఇన్‌వాల్వ్ చేయకండని తప్పించుకుంటున్నారు. కింది స్థాయి అధికారుల్లోనూ తనిఖీల విషయంలో భయం నెలకొంది.

రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారు

- రూ.వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకూ నీరు ఇవ్వలేదు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



సభలో మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి

ఆత్మకూరు, ఫిబ్రవరి2: బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్ల కాలంలో కమీషన్లకు కక్కుర్తి పడి, రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. సీడబ్ల్యూసీ ఆహ్వానిత సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయ యాత్ర మక్తల్ నియోజకవర్గ ముగింపు సభను వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉత్తమ్ ముఖ్య అతిథిగా హాజరై. మాట్లాడారు. పదేళ్ల కాలంలో రూ.94 వేల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం, రూ.27 వేల కోట్లతో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి.. ఇప్పటి వరకు ఒక్క ఎకరాకూ సాగునీరు అందించలేదని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర రైతులను తీవ్రంగా మోసం చేసిందని ధ్వజమెత్తారు. సివిల్ సప్లయ్ శాఖ ద్వారా ధాన్యం కొనుగోలు చేసి, మిల్లర్లతో కుమ్మక్కై రూ.11 వేల కోట్లు అప్పులు చేయడం తప్ప చేసిందేమీ లేదన్నారు. నూతనంగా నిర్మిస్తున్న నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా మక్తల్ నియోజకవర్గంలోని 25 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు చెప్పారు. సంగం బండ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన వారికి ఇప్పటి వరకు పరిహారం అందలేదని, తమ ప్రభుత్వం నెల రోజుల్లోనే రూ.30 కోట్ల రూపాయల పరిహారం అందించి ఆదుకుంటుందని చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 14 శాసన సభ స్థానాలు ఉండగా 12 స్థానాలను గెలిపించి, కాంగ్రెస్ పార్టీ సత్తా చూపించారని హర్షం వ్యక్తం చేశారు. పాలమూరు ఎంపీ అభ్యర్థిగా వంశీచందర్ రెడ్డి త్వరలో ఖరారు కానుందని, ఆయన్ను గెలిపించే బాధ్యత నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, పర్ణికా రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్ పాల్గొన్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ ఉంటేనే ప్రజలకు మేలు

అమరచింత: కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే సామాన్య ప్రజలకు న్యాయం జరుగుతుందని సీడబ్ల్యూసీ ఆహ్వానిత సభ్యుడు చల్లా వంశీచందర్ రెడ్డి అన్నారు. ఆయన చేపట్టిన పాలమూరు న్యాయ యాత్ర శుక్రవారం రాత్రి అమరచింతకు చేరుకుంది. ఈ సందర్భంగా బస్టాండ్‌లో సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. మక్తల్ నియోజకవర్గంలో విజయవంతంగా కొనసాగుతున్న యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఉద్యమాల గడ్డ అయిన అమరచింత వామపక్ష పార్టీలతో కలిసి ఎంపీ ఎన్నికల్లో జెండా ఎగురవేస్తామని అన్నారు.



అడుగంటిన కృష్ణానది



ఎల్లూరు వద్ద మిషన్ భగీరథ ప్లాంటు

వట్టిపోతున్నది

- కృష్ణానదికి ముంచుకొస్తున్న నీటి కష్టాలు
- నదిలో ప్రస్తుతం 13 టీఎంసీలు మాత్రమే నీటి నిల్వలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మిషన్ భగీరథ పథకానికి నీరందించేందుకు అధికారుల కసరత్తు
- సాగునీరు ఇవ్వలేమంటున్న ఇరిగేషన్ అధికారులు
- వరి రైతులకు తప్పని తిప్పలు

కొల్లాపూర్, ఫిబ్రవరి 2 : ఈ ఏడాది ఎగువ ప్రాంతాల నుంచి కృష్ణానదికి ఆశించిన స్థాయిలో వరద జలాలు చేరకపోవడంతో వేసవి ప్రారంభం కాకముందే కృష్ణానది వట్టిపోతోంది. ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలకు ఈ వేసవిలో తాగునీటి కష్టాలు ముంచుకొస్తున్నాయి. తాగునీటి కష్టాలు తలెత్తకుండా రైతులకు సాగునీటిని నిలిపివేసి మిషన్‌భగీరథ పథకం ద్వారా ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజల తాగునీరు అందించాలని ప్రభుత్వ యంత్రాగం, పాలకులు యోచిస్తున్నారు. ప్రతీ ఇంటికి సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన మిషన్‌భగీరథ పథకం ద్వారా ఉమ్మడి పాలమూరు జిల్లాతోపాటు రంగారెడ్డి, వికారాబాద్ ప్రాంతాల్లో ఉన్న 4వేల గ్రామాలకు మొత్తం 19 మునిసిపాలిటీలకు, 21 నియోజకవర్గాలకు తాగునీరందించాల్సి ఉంది. ఎల్లూరు, మహాత్మాగాంధీ లిఫ్టు ఇరిగేషన్ ద్వారా కృష్ణానది నీటిని ఎల్లూరు రిజర్వాయర్‌కు చేర్చి కేవలం మిషన్‌భగీరథ పథకం అమలు కోసమే ప్రస్తుతం నీటిని వినియోగిస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు తిరుగు జలాలు తగ్గుముఖం పట్టడంతో అధికారులు అప్రమత్తమై తాగునీటి కష్టాలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు కృష్ణానదిలో నీటి నిల్వలను పరిశీలిస్తూ ఎల్లూరు రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి ఎఫ్ఆర్ఎల్ (ఫుల్ రిజర్వాయర్ లెవల్) 885 అడుగులు ఉండగా ప్రస్తుతం 821.90 మాత్రమే నీటి నిల్వలు ఉన్నాయి. ఎఫ్ఆర్ఎల్ 885 ఫీట్లు అయితే ప్రస్తుతం 800 ఫీట్ల వరకు మాత్రమే ఎంజీఎల్ఐ ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేసేందుకు ఆస్కారం ఉంది. దీంతో ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టులో మొత్తం 42.2130 టీఎంసీల నీరు ఉండగా ఇందులో 13 టీఎంసీలు మాత్రమే ఎంజీఎల్ఐ ప్రాజెక్టు ద్వారా నీటిని వినియోగించుకునేందుకు అవకాశం ఉంది. ఎఫ్ఆర్ఎల్ 800 దాటితే కృష్ణానది నీటిని ఎంజీఎల్ఐ ప్రాజెక్టు ద్వారా విడుదల చేయలేని పరిస్థితి నెలకొంటుంది. 13 టీఎంసీల నీరు ఇలాగే వేసవి పూర్తి వరకు అందుబాటులో ఉంటే ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలతో పాటు రంగారెడ్డి, వికారాబాద్ ప్రజలకు తాగునీటికి ఢోకా ఉండదు.

ముచ్చుమర్రి ప్రాజెక్టు ద్వారా నీటి విడుదలపై ఆందోళన

ముచ్చుమర్రి ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయలసీమ రైతులకు కృష్ణానది నీటిని సాగుకు విడుదల చేస్తుండటంతో తెలంగాణ ప్రజల్లో ఆందోళన మొదలైంది. వేసవి ప్రారంభంలోనే కృష్ణానది వట్టిపోతున్న తరుణం.. మరో వైపు ముచ్చుమర్రి ప్రాజెక్టు గ్రావిటీ ద్వారా నీటి విడుదల కొనసాగుతుండడంతో కృష్ణానదిలో నీటి నిల్వలు పూర్తిగా పడిపోతే ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరి రైతులకు తప్పని తిప్పలు

కృష్ణానదిలో నీటి నిల్వలు పూర్తిగా తగ్గుముఖం పట్టనుండటంతో జిల్లా రైతులు యాసంగిలో వరి సాగు చేయొద్దని ప్రభుత్వం సూచించింది. ఎంజీఎల్ఐ ప్రాజెక్టుపై ఆధారపడి రైతులు వరి సాగు చేస్తే సాగునీరందించని పరిస్థితి ఉంటుంది. వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ఎంజీఎల్ఐ ప్రాజెక్టు సాగునీరు అందించలేమని కేవలం ఎల్లూరు రిజర్వాయర్ ద్వారా మిషన్‌భగీరథ పథకానికే కృష్ణానది నీటిని వినియోగిస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు. జనవరి నుంచి మే వరకు రైతులకు కావాల్సిన సాగునీరు ఎంజీఎల్ఐ ప్రాజెక్టు ద్వారా అందించడం కష్టతరంగా మారింది. దీంతో రైతులు చెరువులు, బావులు, బోర్లపై ఆధారపడి పంటలు సాగు చేసే పరిస్థితి నెలకొంది. కొందరు రైతులు అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తూ కొల్లాపూర్ నియోజకవర్గంలో ఆయా మండలాల్లో వరి పంటలు సాగు చేయడంతో పంట చివరి దశలో కావాల్సిన సాగునీటిని అందించేందుకు రైతులు కష్టాలు పడే పరిస్థితి నెలకొంది.

పది విద్యార్థుల పస్తులు

- ఉదయం, సాయంత్రం గంటపాటు అదనంగా ప్రత్యేక తరగతులు
- అందని అల్పాహారం
- నీరసించిపోతున్న ఇతర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు



ఉత్తనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాయంత్రం ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

అయిజ, ఫిబ్రవరి 2: ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందక పస్తులుంటున్నారు. ఉత్తీర్ణశాతాన్ని పెంచే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తోంది. నవంబరు ఒకటవ తేదీ నుంచి ఒక పూట మాత్రమే ప్రత్యేక తరగతులు నిర్వహించగా, జనవరి ఒకటో తేదీ నుంచి ఉదయం, సాయంత్రం పాఠశాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గత విద్యా సంవత్సరం ప్రత్యేక తరగతుల నేపథ్యంలో జనవరి ఒకటో తేదీ నుంచి ఏప్రిల్ వరకు విద్యార్థులకు అల్పాహారం అందించారు. ఈ సారి జనవరి ముగిసి, ఫిబ్రవరి వచ్చినా అల్పాహారం ఇవ్వడం లేదు. దాంతో విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు.

6,100 మంది విద్యార్థులు

జోగుళాంబ గద్వాల జిల్లాలో 85 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 6,100 మంది విద్యార్థులు పదో తరగతి చదువుకుంటున్నారు. వీరంతా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు. జిల్లాలో గత సంవత్సరం పదో తరగతిలో 80 శాతం ఫలితాలు సాధించారు. ఈ సారి ఉత్తీర్ణత శాతం మరింతగా పెంచాలనే ఉద్దేశంతో విద్యాశాఖ ఉదయం 8:30 గంటల నుంచి 9:30 గంటల వరకు, సాయంత్రం 4:30 గంటల నుంచి 5:30 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తోంది. గత ఏడాది అల్పాహారం కోసం ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి ఐదు రూపాయల చొప్పున ఇచ్చింది. కానీ ఈ సారి పథకాన్ని అమలు చేయడం లేదు.

సైకిల్ తొక్కలేకపోతున్నారు..

ప్రత్యేక తరగతుల నేపథ్యంలో ఉదయం గంట ముందు వచ్చి, సాయంత్రం గంట ఆలస్యంగా వెళ్తున్న విద్యార్థులు ఆకలితో ఇబ్బందులు పడుతున్నారు. 8:30 గంటలకే పాఠశాలకు రావాల్సి ఉండటంతో గ్రామాల నుంచి వచ్చే వారు ఏడు గంటలకే బయల్దేరాల్సి వస్తోంది. దాంతో అరకొరగా తిని వస్తున్నారు. ఒక్కోసారి వంట కాకపోవడంతో ఖాళీ కడుపులతోనే వస్తున్నారు. దాంతో మధ్యాహ్నం వరకు నీరసానికి గురవుతున్నారు. ఇతర గ్రామాల నుంచి వచ్చే వారు తిరిగి ఇంటికి చేరుకునే వరకు రాత్రి ఎనిమిది గంటల నుంచి తొమ్మిది గంటలు అవుతోంది. దాంతో అప్పటి ఆకలితో అలమటిస్తున్నారు. సైకిళ్లపై వచ్చే వారు శరీరం నీరసించంతో తిరిగి ఇళ్లకు వెళ్లేటప్పుడు సైకిళ్ల తొక్కలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి అల్పాహారం అందించేలా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



యాపదిన్నె ప్రభుత్వ పాఠశాలలో గత ఏడాది పదో తరగతి విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం

అమలయ్యేలా చూస్తాం

ప్రత్యేక తరగతులకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అమలయ్యేలా చర్యలు తీసుకుంటాము. నిధులు రాని కారణంగానే అమలుకు నోచుకోవటం లేదు. గత ఏడాది నిధులు రావటంతో అమలు చేశాం. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి అమలయేలా చర్యలు తీసుకుంటాం.

- సిరాజుద్దీన్, డీఈవో, జోగుళాంబ గద్వాల

మంత్రాలయం టు చిన్నచింతకుంట

▸▸ మిరప ఏరేందుకు వచ్చిన కూలీలు

చిన్నచింతకుంట, ఫిబ్రవరి 2 : కరువు జిల్లాగా పాలమూరుకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడి కూలీలే ఇతర రాష్ట్రాల్లో లేబర్ కూలీలుగా గతంలో అనేకమంది వలస వెళ్లారు. అయితే ప్రస్తుతం కరువు జిల్లాకే వలస వచ్చారు మంత్రాలయం కూలీలు.

మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని ఏదులాపూర్, దాసర్‌పల్లి, అప్పంపల్లి, ఉంద్యాల, పర్దీపూర్, వడ్డెమాన్, లాల్‌కోట తదితర గ్రామాలకు మంత్రాలయం నుంచి కూలీలు వచ్చారు. దాదాపు 1200 మంది దాకా ఇక్కడికి వలస వచ్చారు. తుంగభద్ర నది ఎండిపోవటం, అక్కడ సాగునీటికి ఇబ్బందులు రావటం, పనులు లేక పోవడంతో బతుకుజీవుడా అంటూ పలువురు కూలీలు పొట్ట చేత పట్టుకుని, పాలమూరు జిల్లాకు వలస వచ్చారు.



చిన్నచింతకుంట మండలం ఏదులాపూర్ గ్రామ శివారులోని మిరప తోటల్లో కాయలను ఏరుతున్న మంత్రాలయం కూలీలు

షార్ట్ సర్క్యూట్‌తో జొన్నపంట దగ్ధం

రాజోలి, ఫిబ్రవరి 2 : విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ కావడంతో చేతికొచ్చిన జొన్న పంట దగ్ధమైన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని పెద్దధన్వాడ గ్రామంలో చోటు చేసుకుంది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయ శ్రీను అనే రైతుకు చెందిన ఒకటిన్నర ఎకరాల్లో జొన్న పంట సాగు చేశాడు. వారం రోజుల్లో కోతలు కోస్తే పంట చేతికొస్తుందని ఎదురుచూస్తున్న రెతుకు నిరాశ మిగిలింది. శుక్రవారం ఉదయం పంట పొలంలో సాగునీరు కోసం బోరు మోటార్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్‌కు గురికావడంతో జొన్న పంటకు నిప్పులు చెలరేగి పంట దగ్ధమైంది. స్థానికులు గమనించి పక్క పొలాలకు మంటలు చెలరేగకుండా అదుపు చేశారు. బోయ శ్రీనుకు చెందిన జొన్న పంట పూర్తిగా దగ్ధం అయింది. సుమారు రూ.ఒక లక్ష ఉంటుందని అంచనా వేశారు. ఆర్ఐ శ్రీనివాసులు పంచనామా చేశారు. బోయ శ్రీనును ప్రభుత్వం ఆదుకోవాలని తోటి రైతులు కోరుతున్నారు.

రేపు ఇంటర్ గురుకుల ప్రవేశ పరీక్ష

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 2 : సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఇంటర్మీడియట్‌లో చేరేందుకు గాను దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల నాలుగో తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ప్రాంతీయ సమన్వయ అధికారి ఫ్లోరెన్స్‌రాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి మహబూబ్‌నగర్ పశ్చిమ రీజియన్‌లో 14 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 6,529 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్‌లో ఐదు, నారాయణపేటలో నాలుగు, జోగుళాంబ గద్వాల జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. పరీక్ష ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని, విద్యార్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని ఆమె సూచించారు.

కలిసికట్టుగా పనిచేస్తే ఎంపీ సీటు మనదే

▸▸ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మక్తల్, ఫిబ్రవరి 2 : బీఆర్ఎస్ నాయకులంతా కలసికట్టుగా పనిచేస్తే మహబూబ్‌నగర్ పార్లమెంటు స్థానాన్ని సులువుగా గెలుపొందవచ్చని మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సత్యవతిరాథోడ్ అన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని వెంకటేశ్వర కన్వెన్షన్ హాల్‌లో మక్తల్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి అధినేత కేసీఆర్ ఎవరిని బరిలో నిలిపినా కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేసి విజయం సాధించాలన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంటు పరిధిలో కార్యకర్తలు అధైర్యపడకుండా పని చేయాలన్నారు. గత పది సంవత్సరాల్లో తెలంగాణను అన్నివిధాల అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, గిడ్డంగుల శాఖ మాజీ చైర్మన్ రజినీసాయిచంద్, బీఆర్ఎస్ నాయకులు దేవరి మల్లప్ప, రాజుల ఆశిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాజేష్‌గౌడ్, లలితమ్మ, శ్రీధర్‌గౌడ్, ఎల్లారెడ్డిలు పాల్గొన్నారు.

పింఛన్ల కోసం రోడ్డెక్కిన లబ్ధిదారులు



జాజాపూర్ స్టేజీ వద్ద అంతర్రాష్ట్ర రహదారిపై బైఠాయించిన లబ్ధిదారులు

నారాయణపేట రూరల్, ఫిబ్రవరి 2 : రెండు నెలలుగా పింఛన్లు అందించడంలో ఆలస్యం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ పింఛన్ లబ్ధిదారులు శుక్రవారం నారాయణపేట జిల్లా పరిధిలోని జాజాపూర్ స్టేజీ వద్ద అంతర్రాష్ట్ర రహదారిపై ఆందోళనకు దిగారు. లబ్ధిదారుల రాస్తారోకోతో దాదాపు గంటపాటు ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ పింఛన్ల కోసం ప్రతీరోజు పంచాయతీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడం పరిపాటిగా మారిందని వాపోయారు. ప్రతీనెల మొదటివారంలోనే పింఛన్లు అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎట్టకేలకు అధికారుల హామీతో లబ్ధిదారులు ఆందోళనను విరమించారు.

పింఛన్ ఇవ్వడంలో నిర్లక్ష్యంపై ఎంపీడీవోకు ఫిర్యాదు



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న నబి

మానవపాడు, ఫిబ్రవరి 2 : మండల కేంద్రంలోని పోస్టాఫీసులో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని అమరవాయి గ్రామానికి చెందిన పింఛన్‌దారులు శుక్రవారం ఎంపీడీవో రమణారావుకు ఫిర్యాదు చేశారు. మధ్యాహ్నం తర్వాత అధికారులు పింఛన్లు ఇవ్వకుండా వెళ్లిపోయారని వాపోయారు. ఈ విషయంపై జిల్లా అధికారులకు తెలిపి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వారికి హామీ ఇచ్చారు.

వ్యభిచార గృహం నిర్వాహకుడి అరెస్ట్

గద్వాల క్రైం, ఫిబ్రవరి 2 : జోగుళాంబ జిల్లా కేంద్రంలోని ఓ కాలనీలో వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న వీరేష్‌నాయక్ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. కేసు వివరాలను శుక్రవారం ఆయన వివరించారు. కేటీదొడ్డి మండలం మల్లాపురం తండాకు చెందిన వీరేష్ నాయక్ గద్వాల పట్టణంలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. ఇతర ప్రాంతాల నుంచి యువతులను రప్పించి వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. ఈ విషయంపై కాలనీవాసులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు దాడి చేసి, ఇద్దరు యువతులను అదుపులోకి తీసుకున్నారు. పరారైన నిర్వాహకుడిని శుక్రవారం అరెస్ట్ చేసి తర్వాత రిమాండ్‌కు పంపించారు. అదుపులోకి తీసుకున్న మహిళలను స్టేట్‌హోంకు తరలించినట్లు సీఐ తెలిపారు.

సాగునీటి సమస్యను పరిష్కరించాలి

» పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి

పాలమూరు, ఫిబ్రవరి 2 : మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజక వర్గానికి సాగునీటి సమస్య పరిష్కారం కోసం గత ప్రభుత్వం చేసిన తప్పులు కాంగ్రెస్ ప్రభుత్వం చేయొద్దని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి అన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు తీరని అన్యాయం చేసిందన్నారు. నేటికీ ఉమ్మడి జిల్లాలో జలవనరుల కల్పనకు జరిగిన పనులు సమగ్ర ప్రణాళికతో చేపట్టలేదన్నారు. గ్రావిటీతో నీరు అందే పథకాలు ఆర్డీఎస్, జూరాల మాత్రమేనని, గత ప్రభుత్వాలు ఆర్డీఎస్ ఆనకట్టను పట్టించుకోలేదన్నారు. జూరాల ప్రాజెక్టును సమర్థవంతంగా నిర్వహించలేదన్నారు. లిఫ్ట్ పథకాలన్నీ అరకొర స్థాయిలో మాత్రమే ఉన్నాయన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో సాగునీటి సమస్య పరిష్కారం కావాలంటే 2013లో విడుదల చేసిన 72 జీవోను, 2014మే నెలలో విడుదల అయిన 69 జీవోను పరిశీలించాలన్నారు. అదేవిధంగా, ఆ తరువాత ఇంజనీర్లు ప్రతిపాదించిన నారాయణపేట-కొడంగల్ పథకాన్ని పాలమూరు అధ్యయన వేదిక సూచనలతో చర్చలో ఉన్న భీమా, కృష్ణానది సంగమం నుంచి నీరు తీసుకునే పథకాన్ని పరిశీలించి నిపుణులైన అనుభవం ఉన్న ఇంజనీర్లతో ఒక నివేదిక తీసుకోవాలన్నారు. ఈ పని తక్కువ వ్యవధిలో పూర్తి చేయవచ్చన్నారు. ఇప్పటికే షాద్‌నగర్ నియోజకవర్గం గత ప్రభుత్వ మోసాలకు గురైందని గుర్తు చేశారు. ప్రభుత్వాల తప్పుడు విధానాలకు ప్రజలు బలికావడం సమంజసం కాదన్నారు. నీటి విషయంలో ఆదిలోనే ముందు చూపులేదు అనే చెడ్డపేరు కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచిది కాదన్నారు.

కృష్ణానది నీళ్లు ఉమ్మడి జిల్లా భవిష్యత్‌పై రేపు రౌండ్‌టేబుల్ సమావేశం

'కృష్ణానది నీళ్లు, ఉమ్మడి జిల్లా భవిష్యత్' అనే అంశంపై ఈనెల నాలుగో తేదీన ఉదయం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవనంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నామని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జలవనరుల కల్పన విషయంలో ఆసక్తి గల ప్రజాస్వామిక వాదులు, మేధావులు, కార్యకర్తలు, రాజకీయ పార్టీల నేతలు, ఇంజనీర్లు నాలుగో తేదీన ఉదయం జరిగే సమావేశానికి రావాలని ఆయన కోరారు.

పోటెత్తిన వేరుశనగ

» మహబూబ్‌నగర్ మార్కెట్ నిండా పల్లి రాశులే
» ప్రతీరోజు10 వేల క్వింటాళ్లు దాటుతున్న అమ్మకాలు
» అధికంగా క్వింటాల్‌కు రూ.7,309 పలికిన ధర
» కర్ణాటక సరిహద్దు నుంచి పల్లీ తీసుకువస్తున్న రైతులు


మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగ

పాలమూరు, ఫిబ్రవరి 2 : పాలమూరు వ్యవసాయ మార్కెట్‌కు వేరుశనగ పోటెత్తింది. మార్కెట్‌లో పట్టనంత పల్లీరాశులు వస్తున్నాయి. మహబూబ్‌నగర్‌తో పాటు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలు, జిల్లా సరిహద్దున ఉన్న కర్ణాటక ప్రాంత గ్రామాలకు చెందిన రైతులు సైతం మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌కు పల్లీని తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. వ్యాపారులు పోటీపడి కొనుగోళ్లు చేయడం.. గిట్టుబాటు కూడా ఉండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రతీరోజు 10 వేల క్వింటాళ్లకు పైగా వేరుశనగ వస్తోంది. గురువారం అత్యధికంగా క్వింటాల్‌కు రూ.7,309, అత్యల్పంగా రూ.3,512 ధర పలికింది. జనవరి 31న 11,923 క్వింటాళ్ల వేరుశనగ రావడం గమనార్హం. జిల్లాలో ఈ ఏడాది పెద్దఎత్తున పల్లీ సాగుచేయడంతో పాటు పంట కూడా బాగా వచ్చింది. మహబూబ్‌నగర్ మార్కెట్‌లో వ్యాపారస్తులు పోటీపడి పల్లీ కొనుగోలు చేస్తుండటంతో జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి రైతులు ఇక్కడికి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. వ్యాపారులు వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ పంటను కొనుగోలు చేస్తుండడం, మద్దతు ధర కూడా ఎక్కువగానే ఉండటంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఈనెలాఖరు వరకు పంట ఇలానే మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎగుమతి లేకపోవడంతో ధర కొద్దిగా తగ్గినా ఈ సమయంలో ఈమాత్రం ధర కూడా పరువాలేదని రైతులు చెబుతున్నారు.

పాలమూరులోనే మంచి ధర



పాలమూరులోనే పల్లీకి గిట్టుబాటు ధర వస్తోంది. ఇక్కడ వ్యాపారులు అధికంగా ఉండడం, పోటీ పడి కొనడంతో మంచి ధర వస్తోంది. యజమానులు రైతులకు అవసరమైన విత్తనాలు, అవసరానికి డబ్బు ఇవ్వటంతో ఇక్కడికే తీసుకువస్తాం.

- మానిక్యప్ప, ఉడుమలగిద్ద, దామరగిద్ద మండలం

ఎగుమతి లేకపోయినా మంచి ధర



ప్రభుత్వం ఇతర ప్రాంతాలకు ధాన్యాన్ని ఎగుమతి చేయటం ఆపేసిన సమయంలో మహబూబ్‌నగర్ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.7,309లు రావడం మంచి ధరనే. తక్కువలో రూ.3,512లు వస్తుంది. ఏరోజుకు ఆరోజు ధాన్యం కాంటా చేసుకొని పంపిస్తున్నారు.

- వెంకట్‌రెడ్డి, భూనీడు, కొత్తపల్లి మండలం

కొత్తదారుల్లో 'రియల్' దందా

» ప్లాట్లకు తహసీల్ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్లు
» అవినీతిలో కూరుకుపోయిన రెవెన్యూ కార్యాలయం
» అనుమతులు లేకపోయినా పట్టించుకోని పంచాయతీలు


శెట్టిఆత్మకూర్ గ్రామంలో అనుమతులు లేకుండా వెలిసిన వెంచర్

గద్వాల, ఫిబ్రవరి 2 : రియల్ వెంచర్ వ్యాపారులు కొత్తదారులు వెతికారు. నయాపైసా ఖర్చు, అనుమతులు లేకుండా వెంచర్‌లు వేసి ప్లాట్లను విక్రయించడంతో పాటు, వాటికి రిజిస్ట్రేషన్లు సైతం చేయిస్తున్నారు. ఇందుకు వేదికగా తహసీల్దార్ కార్యాలయాన్ని ఎంచుకున్నారు. వ్యవసాయ పొలాలనే వెంచర్లుగా చేసి గుంటల లెక్కన రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. ఇలా చేసేందుకు పెద్దఎత్తున చేతులు తడుపుతుండటంతో రిజిస్ట్రేషన్లు సులువుగా అయిపోతున్నాయి. ప్రస్తుతం రియల్ ఢమాల్ కావడంతో డీటీసీపీ నిబంధనల ప్రచారం వేసిన వెంచర్‌దారులకు నష్టాలు రావడంతో కొత్తదారులు ఎంచుకున్నారు. వీరికి రెవెన్యూ, పంచాయతీ అధికారులు అండదండలు ఇవ్వడం లాభాలను తెచ్చిపెడుతున్నది.

నిబంధనలు తుంగలో తొక్కి..

రియల్ వెంచర్లు వేయాలంటే డీటీసీపీ నిబంధనలు పాటించాలి. నాన్ అగ్రికల్చర్‌గా భూమార్పిడి చేసి 33 పీట్ల రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు, పదిశాతం ఖాళీ స్థలం వదలాలి. అప్పుడు డీటీసీపీ అనుమతులు వస్తాయి. రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు అవుతాయి. కానీ వీటిని పాటించాలంటే పెద్దఎత్తున ఖర్చు అవుతుంది. దీంతో ప్లాట్ల ధరలు పెరుగుతాయి. కానీ ఇవేవీ లేకుండా వెంచర్ వేసి ప్లాట్లు అమ్మితే డబ్బు ఆదా అవ్వడంతో పాటు ప్లాట్ల ధరలు తక్కువ పెట్టి త్వరగా విక్రయించుకోవచ్చు. రోడ్లు, డ్రైనేజీలతో పాటు, పదిశాతం భూమి మిగులుతుందనే దురాశతో నిబంధనలు తుంగలో తొక్కారు. మండల పరిధిలోని శెట్టిఆత్మకూర్ గ్రామంలో సర్వే నెంబర్ 484లో ఐదెకరాలలో, అదేవిధంగా తుర్కోనిపల్లి, ముల్కలపల్లి, పూడూరు, పరమాల గ్రామాల్లో వెంచర్లు వేశారు. వీటిని ఆదిలోనే అడ్డుకోవాల్సిన పంచాయతీ కార్యదర్శులు కొందరు వెంచర్ వ్యాపారులతో కుమ్మక్కు కాగా, మరికొందరు రాజకీయ వత్తిడిలతో నిశ్చేష్టులుగా ఉన్నారు.

వెంచర్ ప్లాట్లకు తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు

సాధారణంగా వెంచర్‌లోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కానీ ఈ వెంచర్లకు డీటీసీపీ అనుమతులు లేకపోవడం, అగ్రికల్చర్‌గానే కొనసాగుతున్న భూమిలో వేసిన వెంచర్లు కావడంతో తహసీల్దార్ కార్యాలయాన్ని ఎంచుకున్నారు. అయితే ఇక్కడ ఐదుగుంటల లోపు రిజిస్ట్రేషన్లు చేయరు. అలా చేయిస్తున్నారంటే తప్పక అవి నాన్‌అగ్రికల్చర్ వినియోగంగా భావించి రిజిస్ట్రేషన్ నిలిపివేయాలి. తనిఖీ చేసిన తర్వాత వ్యవసాయ ఉపయోగమంటేనే చేయాలి. కానీ తహసీల్దార్ కార్యాలయంలో రాళ్లు పాతి, ప్లాట్లుగా చేసిన భూమికి గుంటల ప్రకారం రిజిస్ట్రేషన్ చేయడం విడ్డూరం. శెట్టిఆత్మకూర్ గ్రామంలోని సర్వే నెంబర్ 484కు బై నెంబర్లుగా ఇచ్చుకుంటూ గుంటల ప్రకారం రిజిస్ట్రేషన్లు చేశారు. వెంటనే ప్లాట్లలో ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇందులో పెద్దఎత్తున చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది ఒక శెట్టిఆత్మకూర్‌కు మాత్రమే పరిమితం కాలేదు. తుర్కోనిపల్లి, ముల్కలపల్లి, మేళచెరువు, పరమాల, పూడూరు గ్రామాల్లో కూడా కొనసాగాయి. అంతేకాకుండా వీరికి కొత్త ఖాతా నెంబర్లు, పాసు పుస్తకాలు ఇవ్వడం కొసమెరుపు. అదేవిధంగా వీటికి రైతుబంధు కూడా వస్తోంది. ప్రభుత్వం ఎన్ని నిబంధనలు పెట్టినా అక్రమదారులకు అధికారులు తోడు కావడంతో ఇవి కొనసాగుతున్నాయి.

ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదు
- చెన్నయ్య, ఎంపీడీవో గద్వాల

వెంచర్‌దారులకు నోటీసులు ఇచ్చాం. రాళ్లు తొలగించాలని కార్యదర్శులను ఆదేశించాను. అనుమతులు లేని వెంచర్లకు, అందులో ప్లాట్ల పట్టాదారులకు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదు.

ఎలా జరిగిందో విచారణ చేస్తాం
- వెంకటేశ్వర్లు, తహసీల్దార్ గద్వాల

ఐదు గుంటల వరకు రిజిస్ట్రేషన్ చేయవచ్చు. అది కూడా వ్యవసాయానికి ఉపయోగిస్తేనే చేయాలి. కానీ గుంట, రెండు గుంటలకు రిజిస్ట్రేషన్ చేయరు. కానీ 484 సర్వే నెంబర్‌పై విచారణ చేస్తాం. ఎవరు చేశారు.. ఎందుకు చేశారనే దానిపై వివరాలు తీసుకొని నివేదిస్తాం.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

» మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
» మన్యంకొండ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సన్నాహక సమావేశం



బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఇతర శాఖల అధికారులు

మహబూబ్‌నగర్(కలెక్టరేట్), ఫిబ్రవరి 2 : ఈనెల 19 నుంచి మార్చి 27 వరకు నిర్వహిస్తున్న మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల విషయమై శుక్రవారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ఆయన కలెక్టర్ జి.రవినాయక్‌తో కలిసి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో బ్రహ్మోత్సవాలకు చేయాల్సిన ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. తెలంగాణలోనే చిన్న తిరుపతిగా పేరుగాంచిన మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఈ సంవత్సరం గత సంవత్సరానికి మించి ఎక్కువమంది భక్తులు రావచ్చని, ఉచిత బస్సు సౌకర్యం వల్ల మహిళలు ఎక్కువమంది వస్తారని, ఇందుకుగాను అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన తాగునీరు, శానిటేషన్, టాయిలెట్లు, బందోబస్తు రద్దీ నియంత్రణ వంటి సౌకర్యాలను కల్పించాలని అన్నారు.

కలెక్టర్ జి.రవినాయక్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముఖ్యమైన రోజులైన ఫిబ్రవరి 24న స్వామివారి గరుడ వాహనసేవ, రథోత్సవం, అలాగే మార్చి 25న అలివేలు మంగతాయారు తిరుకల్యాణోత్సవం, రాత్రి రథోత్సవం వంటి కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ఇతర రద్దీ రోజుల్లో సైతం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్రహ్మోత్సవాలను సవ్యంగా నిర్వహించేందుకు శాంతిభద్రత కమిటీ, ఫెస్టివల్ కమిటీ, వాటర్, శానిటేషన్ కమిటీ, ఫుడ్ కమిటీ తదితర కమిటీలను ఏర్పాటు చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, ప్రొబేషనరీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ చిత్తరంజన్, అదనపు ఎస్పీ రాములు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు, మన్నెంకొండ దేవస్థానం చైర్మన్ అలహరి మధుసూదన్, డీఎస్పీ మహేశ్, జిల్లా అధికారులు సమావేశానికి హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి


వెంకట్‌రావు (ఫైల్)

అచ్చంపేట టౌన్, ఫిబ్రవరి 2 : రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు వెంకట్‌రావు(53) శుక్రవారం తన కారులో పనిమీద హైదరాబాద్‌కు వెళ్తుండగా శ్రీశైలం-హైదరాబాద్ రహదారి తుక్కుగూడ సమీపంలోని బీటీఆర్ పార్కు ఎదురుగా వచ్చిన మినీ డీసీఎం ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకట్‌రావు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకట్‌రావు అచ్చంపేట మండలంలోని పుల్జాల గ్రామంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తుండగా, ఆయన భార్య శ్రీలత కూడా ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రైలు కింద పడి మహిళ మృతి

దేవరకద్ర, ఫిబ్రవరి 2 : రైలు కింద పడి మహిళ మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం వెంకటాయపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సయ్యద్‌అక్బర్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గద్దెగూడెం గ్రామానికి చెందిన ఈ.లక్ష్మి(45)కి మతిస్థిమితం లేదు. శుక్రవారం ఉదయం గుర్తు తెలియని రైలు కింద పడి మృతిచెందింది. మృతురాలి కూతురు ప్రవళిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి

జడ్చర్ల, ఫిబ్రవరి 2 : రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ(45) మృతి చెందిన సంఘటన జడ్చర్ల-దివిటిపల్లి రైలు మార్గంలో చోటు చేసుకుందని మహబూబ్‌నగర్ రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగి ఉంటుందన్నారు. ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు రైల్వే ఎస్సై తెలిపారు.

రెడీమిక్స్ మిల్లర్ బోల్తా

గోపాల్‌పేట, ఫిబ్రవరి 2 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం ఏదుట్ల గ్రామం మలుపు వద్ద రెడీమిక్స్ మిల్లర్ల లారీ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వనపర్తి నుంచి ఏదుల వైపు రెడీమిక్స్ మిల్లర్ లోడుతో వెళ్తోంది. డ్రైవర్ వాహనాన్ని వేగంగా నడపడంతో ఏదుట్ల సమీపంలో మూలమలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు గాయాలు కాగా, వనపర్తి ఆసుపత్రికి తరలించారు.

బెల్ట్‌షాపులపై పోలీసుల దాడులు

జడ్చర్ల, ఫిబ్రవరి 2 : జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామంలోని బెల్ట్‌షాపులపై జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. దాడుల్లో బొజ్జచంద్రయ్య దుకాణంలో ఆరు బీర్లు, అబ్దుల్‌సలామ్ దుకాణంలో తొమ్మిది బీర్లు దొరికినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహిస్తామని, మద్యం దొరికితే చర్యలు తప్పవన్నారు.

అడవుల సంరక్షణలో ప్రొటెక్షన్ వాచర్లదే కీలక పాత్ర

» వరల్డ్ వైడ్ ఫండ్ సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కరుణ్‌బల్లా
» టైగర్ వాచర్లకు విలువిద్య పోటీలు, విద్యార్థులకు వ్యాసరచన, నాటక పోటీలు


విజేతలకు బహుమతులను అందజేసిన అటవీ అధికారులు

మన్ననూర్, ఫిబ్రవరి 2 : అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో చెంచు గిరిజనులైన టైగర్ ప్రొటెక్షన్ వాచర్లే కీలక పాత్ర పోషిస్తారని వరల్డ్ వైడ్ ఫండ్ (డబ్ల్యుడబ్ల్యుఎఫ్) సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కరణ్‌బల్లా అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతంలో పనిచేసే 20 బేస్ క్యాంపు వాచర్లకు శనివారం మన్ననూరు చెంచులక్ష్మీ మ్యూజియం వద్ద శుక్రవారం విలువిద్య పోటీలను నిర్వహించారు. విల్లంబులు ఎక్కు పెట్టడంలో ప్రతిభ చాటిన ఒక్కో రేంజ్ నుంచి ముగ్గురిని ఎంపిక చేసి ఓవరాల్ విజేతలుగా ప్రకటించారు. అమ్రాబాద్ రేంజ్ ప్రథమ, మన్ననూర్ రేంజ్ ద్వితీయ, దోమలపెంట రేంజ్ తృతీయ స్థానం సాధించారు. అలాగే మన్ననూరులోని గిరిజన సంక్షేమ పాఠశాల, పీటీజీ గురుకుల పాఠశాల విద్యార్థులకు అడవులు-వన్యప్రాణుల సంరక్షణపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అడవిలో పెద్దపులులు, వేటగాళ్ల వేషధారణ చేసి, పెద్దపులులను వేటాడడం, అడవులను నరికివేయడం వంటి పాత్రపై విద్యార్థులు నాటకాన్ని ప్రదర్శించారు. పెద్దపులులు ఉంటేనే అడవులు సంరక్షింపబడుతాయని, అడవులు నరకవద్దని, చెట్లు ఉంటేనే మానవాళికి ఆక్సిజన్ లభిస్తుందనే సందేశాన్ని చూపరులకు అర్థమయ్యేలా విద్యార్థులు ప్రదర్శన చేశారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన డీఎఫ్‌వో రోహిత్‌గోపిడి పోటీల విజేతలకు బహుమతులను, ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో డబ్లుడబ్లుఎఫ్ డైరెక్టర్ ఫరీదాటాంపాల్, చైర్మన్ శ్రీనివాస్, ఎఫ్‌డీవో బత్తుల విశాల్, రేంజ్ అధికారులు రవికుమార్, ఆదిత్య, సెక్షన్ అధికారి ముజీబ్‌గోరి, బీట్ అధికారులు పాల్గొన్నారు.

చిరుతను బంధించడానికి బోన్లు సిద్ధం

» అటవీ శాఖ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 2 : వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురం మండల కేంద్రం శివారు ప్రాంతం ఎర్రగుంట్ల గుట్ట కిందిభాగంలో అటవీశాఖ అధికారులు చిరుతను పట్టుకునేందు కోసం బోన్లను ఏర్పాటు చేశారు. ఎర్రగుంట్ల గుట్ట వద్ద చిరుత మేకపై దాడి చేసిన దృశ్యాలను రైతులు సెల్‌ఫోన్లలో రికార్డు చేయడంతో చిరుతను బంధించడానికి అటవీశాఖ సిబ్బంది రెండు బోన్లను ఏర్పాటు చేసినట్లు అటవీశాఖ జిల్లా అధికారి నవీన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గత రెండు నెలలుగా మండలంలోని వివిధ ప్రాంతాల్లో చిరుత సంచరిస్తున్నట్లు అనుమానాలు ఉన్న నేపథ్యంలో అటవీశాఖ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినా ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో చిరుతను బంధించడానికి నిర్దిష్టమైన రుజువు లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడినట్లు తెలిపారు. చిరుత దాడిలో మృతి చెందిన గొర్రె, మేక దూడ లాంటి ఆరు జీవాలకు నష్ట పరిహారం చెల్లించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అటవీశాఖ ఘణపురం సర్కిల్ ఇన్‌చార్జి రేంజర్ భాస్కరాచారి, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.



చిరుతను బంధించడానికి సిద్ధం చేసిన బోన్లు

నేటి నుంచి అభయుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ముస్తాబైన ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయం

ఊర్కొండ, ఫిబ్రవరి 2: నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి వారి బ్రహ్మోత్సవాలు శనివారం శకటోత్సవంతో ప్రారంభం కానున్నాయని ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి, పాలక మండలి సభ్యులు మనోహర్ రెడ్డి, నర్సిరెడ్డి, రమేష్ నాయక్‌లు తెలిపారు. వారం రోజుల పాటు కొనసాగనున్న బ్రహ్మోత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. పరిసర గ్రామాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. పాలకమండలి సభ్యులు సంగప్ప గౌడ్ గోపాల్, అంజయ్య గౌడ్, చంద్రయ్య, మల్లేష్ యాదవ్, సువర్ణ, అలివేల లక్ష్మమ్మ ,అర్చకులు దత్తాత్రేయ శర్మ తదితరులు ఉన్నారు.

బస్టాండ్‌లో బాత్‌రూంల నిర్మాణం

కోడేరు, ఫిబ్రవరి 2 : మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో శుక్రవారం బాత్‌రూమ్‌ల కోసం మండల కో ఆప్షన్ మెంబరు ఎస్‌కే.కరీం భూమి పూజ చేశారు. ఎన్నో ఏళ్లుగా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశానుసారం జిల్లా పరిషత్ నిధుల నుంచి 4లక్షల 90వేలు కేటాయించి బాత్‌రూమ్‌ల నిర్మాణం చేపట్టామని ఆయన అన్నారు. భవిష్యత్తులో మండల అభివృద్ధి కోసం తనవంతు సహాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రంగినేని జగదీశ్వర్‌రావు, చలపతిరావు, యాపట్ల నిరంజన్, సురేందర్‌రెడ్డి, రామకృష్ణ, పెద్దబాలపీరు, ఆదిరాజు, మహేష్, సుబ్బయ్య, నాగేష్, చామంతి రాజు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి చక్కటి స్పందన



అటవీ ఉద్యోగినికి కంటి పరీక్ష నిర్వహిస్తున్న వైద్యుడు

మన్ననూర్, ఫిబ్రవరి 2: వరల్డ్ వైడ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) సంస్థ సౌజన్యంతో హైదరాబాద్ స్వరూప్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో పనిచేసే అటవీశాఖ ఉద్యోగులు, టైగర్ ట్రాకర్లు, వాచర్ల కుటుంబ సభ్యులకు మన్ననూరు పర్యాటక వనమాలిక ఆవరణలో శుక్రవారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. కంటి వైద్యుడు డాక్టర్ రిషి ఆధ్వర్యంలో 165 మందికి మైక్రోస్కోపిక్ యంత్రాల ద్వారా కంటి పరీక్షలు నిర్వహించారు. అమ్రాబాద్ అభయారణ్యంలో పని చేసే అటవీ ఉద్యోగులు, టైగర్ ట్రాకర్ల కుటుంబాలకు ఎప్పుడైనా కంటి సమస్యలు వస్తే తమ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించి, శస్త్ర చికిత్సలను సైతం ఉచితంగా నిర్వహిస్తామని ఆసుపత్రి మేనేజరు ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఆప్తాలమిక్ అసిస్టెంటుల భార్గవ్, ఓవైసి, డిప్లప్, కైఫ్ పాల్గొన్నారు.

జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీపై చర్యలు తీసుకోవాలి

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 2 : దళితబంధు పథకంలో కోట్ల రూపాయలు దోచుకుని నిజమైన లబ్ధిదారులకు అన్యాయం చేసిన నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాంలాల్‌పై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముచ్చపోతుల శంకర్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో అచ్చంపేట నియోజకవర్గం చారకొండ మండలంలో 1407యూనిట్లు మంజూరైతే అందులో దాదాపు 60శాతానికి పైగా బోగస్ యూనిట్ల పేరుతో రాంలాల్ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కోట్లాది రూపాయలు తన భార్య, కొడుకు, ఇతర నాయకుల అకౌంట్‌లోకి ప్రభుత్వ డబ్బులను ట్రాన్స్‌ఫర్ చేయించుకోవడం జరిగిందన్నారు. ఈ పథకంలో ట్రాన్స్‌పోర్టు సర్వీస్ సెక్టార్ కింద మంజూరైన అధికారుల జాబితాలో అనర్హుల బోగస్ యూనిట్ల గురించి ఒక్కొక్క యూనిట్ పేరుతో దాదాపు లక్ష రూపాయల లంచం తీసుకుని ఏజెన్సీలతో కుమ్మక్కై దళితబంధును నిర్వీర్యం చేసిన ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాంలాల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని దోచుకున్న నిధులను రికవరీ చేసి నిజమైన లబ్ధిదారులకు అందేవిధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు.

మిరపకాయలను నేలపై ఆరబెట్టకూడదు

తాడూరు, ఫిబ్రవరి 2: మిరప పంట సాగు చేసిన రైతులందరూ మిరపకాయలు కోసిన తర్వాత తప్పనిసరిగా పాలథీన్ కవర్లనే వాటిని ఆరబెట్టాలని పాలెం కృషి విజ్ఞాన కేంద్రం రావేఫ్ విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండల పరిధిలోని ఇంద్రకల్ గ్రామంలో మిరపకాయలుఆరబెట్టడంపై రైతులకు అవగాహన కల్పించారు. తోట నుంచి మిరప పండు తీసినప్పుడు 75 నుంచి 80శాతం తేమ ఉంటుందని, దీనిని 10 నుంచి 11శాతం తేమ వ చ్చేదాకా కాయలు ఆరబెడితే మంచిధర పలుకుతుందని సూచించారు.

బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షునికి సన్మానం



బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌ను సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, నాయకులు

కల్వకుర్తి, ఫిబ్రవరి 2 : బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన ఎ.కల్యాణ్‌నాయక్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, పలువురు నాయకులు కల్యాణ్‌నాయక్‌ను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు. సన్మానించిన వారిలో బీజేపీ నాయకులు నరసింహ, రవిగౌడ్, సాయి తదితరులు ఉన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇచ్చిన మునిసిపల్ కార్మికులు



కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

కల్వకుర్తి, ఫిబ్రవరి 2 : తెలంగాణ మునిసిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు ఈ నెల 16వ తేదీ నుంచి దేశవ్యాప్త సమ్మె చేయనున్నారు. కల్వకుర్తి మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌కు మునిసిపల్ కార్మికులు శుక్రవారం సమ్మె నోటీస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులకు కనీస వేతనాన్ని అమలుపర్చాలని, కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.25లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కల్వకుర్తి కమిటీ నాయకులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

కొల్లాపూర్, ఫిబ్రవరి 2 : కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని పదవ వార్డులో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి కౌన్సిలర్ షేక్.రహీంపాషా పనులు ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మంజూరైన 15వ ఫైనాన్స్ నిధుల నుంచి కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలో అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని కౌన్సిలర్ తెలిపారు. మునిసిపల్ కమిషనర్ సొంటె రాజయ్య, వైస్ చైర్‌పర్సన్ మహెము దాబేగంలు హాజరయ్యారు. ఏఈ సాయిరాం, కాంగ్రెస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు, నాయకులు ఖాదర్‌పాష, మస్తాన్‌పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి అనేక కారణాలు

- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



బీఆర్ఎస్ పార్టీ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 2: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమికి అనేక కారణాలు ఉన్నాయని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాగర్‌కర్నూల్, తెల్కపల్లి మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకోవడంతోనే బీఆర్ఎస్ ఓటమి చెందిందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే కథానాయకులని, వారితోనే ఇన్నాళ్లు పార్టీ బలంగా ఉందన్నారు. నియోజకవర్గంలో తాను 5వేల ఓట్లతో ఓడిపోగా రాష్ట్రంలో కేవలం 1.5 శాతం ఓట్ల తేడాతో బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ పార్టీ కలగనలేదని, వారికి ఆరు నెలలు సమయం ఇచ్చి హామీలను నెరవేర్చే విధంగా నిలదీస్తామన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎక్కడ అన్యాయం జరిగినా సహించేది లేదని, వారికి అన్ని వేళలా కంటికి రెప్పలా ఉండి కాపాడుకుంటానన్నారు. రాబోయే పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరిగి పార్టీ సత్తా చాటేందుకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైకని శ్రీనివాస్‌యాదవ్, జిల్లా గ్రథాలయాల సంస్థ చైర్మన్ హనుమంతరావు, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.100 కోట్లతో దేవాలయ అభివృద్ధికి కృషి

చారకొండ, ఫిబ్రవరి 2: మండలంలోని సిర్సనగండ్ల సీతా రామచంద్రస్వామి దేవాలయాన్ని శుక్రవారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పరిశీలించారు. ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ డేరం రామశర్మతో కలిసి ఎమ్మెల్యే ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే బ్రహ్మోత్సవాలలోపు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సహకారంతో రూ. 100 కోట్లతో ఆలయ అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ కేసీ ప్రమీల, ఆలయ ఈవో మల్లెల రఘు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, మండ వర్కింగ్ ప్రసిడెంట్ నాగేంద్ర, సింగిల్‌విండో డైరక్టర్ జగన్‌మోహన్, నాయకులు సందిప్‌రెడ్డి, శంకర్‌గౌడ్, లక్ష్మయ్యగౌడ్, జేసీబీ వెంకటయ్యగౌడ్, గజ్జె కొండల్‌గౌడ్, సహదేవ్, కుకుడాల శ్రీనివాసులు. శివ, దశరథం, ఆది. వెంకట్‌రెడ్డి, నర్సింహరెడ్డి, ఫూల్‌సింగ్, నర్సింహచారి, తిరుమలేష్, ఆలయ అర్చకులు డేరం మురళీధర్‌శర్మ, డేరం వేణుశర్మ తదితరులు పాల్గొన్నారు.



సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

అచ్చంపేట: నియోజకవర్గంలో ఏ గ్రామంలో కూడా సమస్య తలెత్తకుండా ప్రత్యేక అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామపంచాయతీలో ప్రత్యేక అధికారులు ప్రజలకు వారధిగా అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చినా తక్షణమే పరిష్కరించేలా కృషి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రతిపక్ష పార్టీకి ఇంకా మేమే అధికారంలో ఉన్నామన్న భ్రమలో ఉన్నారని, అందుకే ఏదేదో మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. ఎంపీపీ శాంతాబాయి, వైస్ ఎంపీపీ అమరావతి, జడ్పీటీసీ సభ్యుడు మత్రునాయక్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పారదర్శక పాలనకు కృషి చేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 2: గ్రామాల్లో ఏ సమస్య లేకుండా పారదర్శకమైన పాలన అందించేందుకు కృషి చేయాలని గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు కృషి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సర్పంచుల స్థానంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోలు, ఎంపీవోలు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలోని 461 గ్రామ పంచాయతీలలో వంద శాతం వసూలు చేయాలని ఆదేశించారు. అనంతరం మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ఆవిర్భావం సందర్భంగా అదనపు కలెక్టర్ కేక్ కట్ చేసి అధికారులు, సిబ్బందికి పంచిపెట్టారు. జడ్పీ సీఈవో ఉష, డీఆర్‌డీవో నర్సింగరావు, డీపీవో కృష్ణ, అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారులు

ఊర్కొండ: సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక అధికారులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మాధారం, రాంరెడ్డి పల్లిలలో ఎంపీడీవో ప్రభాకర్, రాచాలపల్లి, జకినాలపల్లిలలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నాగమణి, ఊర్కొండపేట బొమ్మరాజుపల్లి, గుండ్లగుంటపల్లిలలో ఎంపీవో వెంకటేశ్వర్లు, గుడిగానిపల్లి, బాల్య లోక్యతండా, తిమ్మనపల్లిలో తహసీల్దార్ చెన్నకిష్టన్న, ముచ్చర్లపల్లి, ఊర్కొండ, జగబోయినపల్లిలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి శోభారాణి, రేవల్లి, నర్సంపల్లిలలో నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఇప్పపహాడ గ్రామానికి పశుసంవర్ధక శాఖ మండల అధికారి నాగరాజులు బాధ్యతలు చేపట్టారు.

● చారకొండ: సర్పంచుల పదవీ కాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. శుక్రవారం మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. చారకొండ, శాంతిగుడెంలో ఎంపీడీవో వెంకటేష్, జూపల్లి, కమాల్‌పూర్‌తండా, ఎర్రవల్లిలో తహసీల్దార్ కేసీ ప్రమీల, మర్రిపల్లి, రామచంద్రాపురం, గోకారంలో మండల వ్యవసాయశాఖ అధికారి చిన్నహుసేన్ యాదవ్, తుర్కలపల్లి, శేరిఅప్పారెడ్డిపల్లిలో నాయబ్ తహసీల్దార్ విద్యాధరి రెడ్డి, శిర్సనగండ్ల, అగ్రహారంతండా, గైరాన్‌తండాలో పీఆర్ ఏఈ మౌనిక, సారంబండతండాలో వెటర్నరి డాక్టర్ శివకుమార్, తిమ్మాయిపల్లి, జేపల్లిలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రితిష్, చంద్రాయన్‌పల్లిలో ఇరిగేషన్ ఏఈ విశ్వనాథ్‌లు తమ బాధ్యలు స్వీకరించారు.

● అచ్చంపేటఅర్బన్: సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామపంచాయతీలు కొనసాగుతున్నట్లు ఎంపీడీవో మధుసూదన్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పడిని వివిధ శాఖల అధికారులను అచ్చంపేట మండలంలోని 38 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో శుక్రవారం ఆయా శాఖలకు చెందిన అధికారులు బాధ్యతలు చేపట్టారు. ప్రత్యేక అధికారులు వీరే.. అక్కారం కృష్ణాజీ, ఆంజనేయతండా లక్ష్మీరాగసంధ్య, అక్కిరోనిపల్లి లక్ష్మణ్‌సింగ్, బక్కాలింగాయపల్లి అశోక్‌కుమార్, బోల్గట్‌పల్లి శ్రీలత, బొమ్మన్‌పల్లి శ్రీనివాసులు, బ్రాహ్మణ్‌పల్లి వెంకటేష్, బుద్ధతండా గీతాంజలి, చంద్రపూర్ వరలక్ష్మి, చేదుబాయితండా రేఖా, చెంచుపల్లుతండా లింగయ్య, చెన్నారం శ్రీనివాసులు, చౌటపల్లి విజయమణెమ్మ, దర్గాతండా రంజిత్‌కుమార్, దేవలతండా అంజి, దుబ్బతండా బాల్‌రాం, ఘనపూర్ కృష్ణయ్య, గంపన్‌పల్లి సందీప్‌రెడ్డి, హాజీపూర్ పరమేష్, ఐనోల్ పాండు, జోగతండా లక్ష్మిపతి, కన్యతండా కమల, కిష్టతండా ప్రియ, కోరతండా విజయ్‌కుమార్, లక్ష్మాపూర్ మధుబాబు, లింగోటం వెంకటేశ్వర్లు, మన్నేవారిపల్లి శ్రీధర్‌రావు, మార్లపాడుతండా లక్ష్మి, నడింపల్లి మధుసూదన్‌గౌడ్, పద్మరాంతండా రవితేజ, పెద్దతండా విజయ, పల్కపల్లి రాములు, పుల్జాల శ్రీనివాసులు,



కేక్ కట్ చేస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్

రంగాపూర్ ఎల్లయ్య, శివారుతండా రాజేంద్ర, సిద్దాపూర్ దమయంతి, సింగారం రాధిక, ఎద్దమిట్టతండా అనేష‌ను నియమించారు.

● కోడేరు: గ్రామపంచాయతీలో స్పెషల్ ఆఫీసర్లుగా శుక్రవారం ప్రభుత్వ అధికారులు బాధ్యతలు చేపట్టారు. మండల పరిధిలోని మాచుపల్లి గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా మండల పంచాయతీ ఆఫీసర్ వి.శ్రావణ్‌కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. మండలంలోని 22గ్రామపంచాయతీలకు సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో అన్ని గ్రామపంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించామని మండల అభివృద్ధి అధికారి బాలచందర్ సుజన్ తెలిపారు.

● అమ్రాబాద్: మండలంలోని 20 గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారుల ద్వారా శుక్రవారం నుంచి పాలన కొనసాగించడానికి జిల్లా అధికారులు గ్రామపంచాయతీలను కేటాయించారు.

బీకే తిరుమలాపూర్, మాధవానిపల్లి, బీకే లక్ష్మాపురం తండా, మాచారం గ్రామ పంచాయతీల బాధ్యతను ఎంపీడీవో రామ్మోహన్‌కు అప్పగించారు. అలాగే వటవల పల్లి, కుమ్మరోనిపల్లి , బీకే ఉప్పునుంతల, ప్రశాంత్ నగర్‌కు ఎంపీవో వెంకటయ్య, జంగంరెడ్డిపల్లి, తెలుగు పల్లెలకు తహసీల్దార్ శ్రీకాంత్, వేంకటేశ్వరబావి, సలరాపల్లిలకు ఎంఈవో బాల కిషన్, వంగురోణిపల్లి, కల్ములోనిపల్లిలకు ఏవో సందీప్ కుమార్, కొత్తపల్లి గ్రామ పంచాయతీకి డిప్యూటీ తహసీల్దార్ రావుప్‌ను నియమించడం జరిగింది.

అంతరాలు లేని విద్యనందించాలి



రాజాపూర్ పాఠశాలలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న టీపీటీఎఫ్ సభ్యులు

కోడేరు, ఫిబ్రవరి 2 : విద్యార్థులకు అంతరాలు లేని విద్యనందించాలని పేదలు, ధనికుల పిల్లలందరికీ ఒకే రకమైన విద్యాలయాల్లో విద్యాబోధన అందించే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వెంకట్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాజాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో ఈ నెల 11, 12తేదీల్లో ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని నిర్వహించిన ప్రచారంలో ఆయన కోరారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ బంట్రోత్ పిల్లలైనా, కలెక్టర్ పిల్లలైనా ఒకే పాఠశాలలో చదివే విధంగా చూడాలన్నారు.

ఎస్ఐగా మహేందర్ బాధ్యతల స్వీకరణ

వంగూరు, ఫిబ్రవరి 2: వంగూరు ఎస్ఐగా మహేందర్ శుక్రవారం వంగూరులో బాధ్యతలు స్వీకరించారు. నాగర్‌కర్నూల్ టౌన్ ఎస్ఐగా పని చేసిన ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన కురుమూర్తి జిల్లాలోని కోడేరుకు బదిలీ అయ్యారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. విధి నిర్వహణలో ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

చారకొండ ఎస్ఐగా రాజశేఖర్

చారకొండ: ఎస్ఐగా రాజశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చారకొండలో ఎస్ఐగా పనిచేసిన రవి వెల్దండకు బదిలీపై వె ళ్లారు. మహబూబ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ-2గా పనిచేసిన రాజశేఖర్ బదిలీ పై చారకొండకు వచ్చారు. శాంతి భద్రతలకు ప్రతీ ఒక్కరు సహకరించాలని ఎస్ఐ రాజశేఖర్ కోరారు.

ఘనంగా ఉపాధి హామీ ఆవిర్భావ దినోత్సవం

వంగూరు, ఫిబ్రవరి 2: మండలంలోని జాజాలలో శుక్రవారం జాతీయ ఉపాధిహామీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీవో పీడీ నర్సింగ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలతో కలసి ఆయన కేక్‌కట్ చేశారు. ఉపాధి హామీలో వంద రోజులు పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీల కుటుంబాలలో భాగంగా రాములమ్మ, అలివేలమ్మలను పూలమాల శాలువాలతో సన్మానించారు. అనంతరం జాజాల-ముకురాల రోడ్డు వరకు జరుగుతున్న ఫీడర్ చానల్ పనులను నర్సింగ్‌రావు పరిశీలించారు. ఎంపీడీవో విజయభాస్కర్, ఏపీఎం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఉప్పునుంతల: ఉపాధిహామీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలో ఉపాధి హామీ కూలీలతో కలిసి ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్య, టీఏలు సింగోటం, జీవన్, సత్యనారాయణ రాజు, ఏపీవో సుదర్శన్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి రాజతర్నంతో కలిసి నూతన మాజీ సర్పంచ్ సరిత ఉపాధిహామీ ఆవిర్భావ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు.

● కల్వకుర్తి: కల్వకుర్తి మండల పరిధిలోని తర్నికల్ గ్రామంలో జాతీయ మహాత్మాగాంధీ ఉపాధి హామీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కల్వకుర్తి మండలంలోని మార్చాల గ్రామంలో ఎంపీడీవో ఆంజనేయులు, తర్నికల్ గ్రామంలో ఎంపీవో, స్పెషల్ ఆఫీసర్ దేవేందర్‌ల ఆధ్వర్యంలో ఉపాధి కూలీలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలను వారు సత్కరించారు. స్థానిక నాయకులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు ఉన్నారు.

● అమ్రాబాద్: అప్పటి యూపీఏ ప్రభుత్వ పేదరిక నిర్మూలన కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అమ్రాబాద్ మండల పరిధిలోని జంగం రెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం ప్రజా ప్రతినిధులు అధికారులు, ఉపాధి హామీ కూలీలతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఎంపీడీవో రామ్మోహన్, మండల పంచాయతీ అధికారి వెంకటయ్య సర్పంచ్ ఎంపీటీసీ మంతటి రామాజనేయులు, ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మ, ఉపాధి హామీ ఈసీ రేనయ్య, టెక్నికల్ అసిస్టెంట్ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి రాజారం పాల్గొన్నారు.

● బల్మూరు: వలసల నివారణకు చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఆదుకునే విధంగా ముందుకు సాగుతుందని టెక్నికల్ అసిస్టెంట్ తులసీరామ్, ఫీల్డ్ అసిస్టెంట్ చెన్నయ్యలు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అనంతవరం, నర్సాయిపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ఆవిర్భావ సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు వంద రోజులు పనులు పూర్తి చేసుకుని ఉన్న వారిని శాలువా, పూల మాలలతో సన్మానించారు.

ఎంపీ టికెట్ కోసం కొడిదల రాము దరఖాస్తు

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 2: నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థిత్వానికి యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొడిదల దరఖాస్తు చేశారు. శుక్రవారం హైదరాబాదులో గాంధీభవన్ అకౌంటెంట్ ప్రతాప్‌రెడ్డికి అభ్యర్థిత్వానికి దరఖాస్తుతో పాటు రూ.25 రుసుంను చెల్లించారు. అనంతరం ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి దీపదాస్ మున్షీని కలిసిన కొడిదల రాము ఆశీర్వాదం తీసుకున్నారు.

ప్రత్యేక అధికారిగా తహసీల్దార్ బాధ్యతలు

కొల్లాపూర్, ఫిబ్రవరి 2 : సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో కొల్లాపూర్ మండల పరిధిలోని గ్రామాలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. మండల పరిధిలోని కుడికిళ్ల గ్రామానికి ప్రత్యేక అధికారిగా మండల తహసీల్దార్ శ్రీకాంత్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.

గ్రామ ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం

కొల్లాపూర్, ఫిబ్రవరి 2 : కుడికిళ్ల గ్రామాభివృద్ధి కోసం గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు చేసిన కృషి అభినందనీయమని మండల జడ్పీటీసీ సభ్యురాలు జూపల్లి భాగ్యమ్మ పేర్కొన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో శుక్రవారం కుడికిళ్ల గ్రామంలో గ్రామ సర్పంచ్ జ్యోతిరాము, ఇతర వార్డు సభ్యులను జడ్పీటీసీ జూపల్లి భాగ్యమ్మ శాలువా, పూల మాలలతో సత్కరించారు. మాజీ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి రఘుపతిరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాము, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

●పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని పెద్దకార్పాముల గ్రామ సర్పంచ్ వార్డు సభ్యులను శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. జనవరి 31వ తేదీతో సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తి కావడంతో పెద్దకార్పాముల సర్పంచ్ పరిమాల శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ సొంటె ఎల్లయ్య, వార్డు సభ్యులను, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్‌లను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాలు గ్రామానికి చేసిన అభివృద్ధి సేవలను గుర్తు చేసుకుంటూ గ్రామాభివృద్ధిలో సహకరించిన ప్రజాప్రతినిధులకు, వివిధ పార్టీల నాయకులకు, పాలకవర్గానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగపూర్ విష్ణు, ఎంపీటీసీ సభ్యుడు ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, నాగపూర్ రామచందర్, ఎండి.బాలేమియా, బంగారీ తదితరులు పాల్గొన్నారు.



కుడికిళ్ల సర్పంచ్, సభ్యులను సన్మానిస్తున్న జడ్పీటీసీ సభ్యురాలు భాగ్యమ్మ

చిత్తశుద్ధితో పనిచేశా

● బిజినేపల్లి: గ్రామాభివృద్ధే పరమావధిగా చిత్తశుద్ధి పనిచేశానని సర్పంచ్ గంగారం అశోక్ అన్నారు. మండలంలోని పోలేపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను పంచాయతీ కార్యదర్శి బ్యాలా ఆధ్వర్యంలో గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ గ్రామంలోని అన్ని వర్గాల ప్రజల సహకారంతో ప్రణాళికబద్ధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసినట్లు తెలిపారు. అలాగే గ్రామదేవతల ఆలయాల నిర్మాణం, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇంటింటికి భగీరథ నల్లా నీళ్లు, వివిధ కమ్యూనిటీ భవనాల నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎక్కడ కూడా చిన్న అవినీతికి పాల్పడకుండా గ్రామాభివృద్ధికి అహర్నిషలు కృషి చేయడంలో పాలకమండలి సహకారం ఎంతైనా ఉందన్నారు. ఉపసర్పంచ్ వసంత్ కుమార్, వార్డు సభ్యులు మహేష్, మల్లేష్, అలివేలు, బాలచంద్రి, బాలస్వామి, సువర్ణ, శంకరమ్మ, శాంతి, గ్రామస్థులు మహేందర్, వెంకటయ్య, గంగారం శ్రీశైలం ఉన్నారు.

సైన్స్‌ఫేర్‌లో తెలకపల్లి విద్యార్థి సత్తా

తెలకపల్లి, ఫిబ్రవరి 2 : దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్‌ఫేర్)లో నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి కేకే.రెడ్డి ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి సాయి స్వాతిక్ రూపొందించిన బహుళార్ధ సాధక వ్యవసాయ పరికరం ప్రాజెక్టు ద్వితీయ బహుమతితో సత్తా చాటడానికి డీఈవో గోవిందరాజులు తెలిపారు. బెంగుళూరుకు చెందిన విశ్వేశ్వరయ్య మ్యూజియం, ఏపీ విద్యాశాఖ సంయుక్తంగా విజయవాడలో గత నెల 28 నుంచి నిర్వహిస్తున్న వైజ్ఞానిక ప్రదర్శనలో నేల తేమ శాతాన్ని గుర్తించి అవసరమైన నీటి సరఫరాను చేసు సంరక్షణ జీవశాస్త్ర ఎరువుల రవాణా తదితర పనులను సౌరశక్తి ద్వారా ఎలా వినియోగించవచ్చు అనే పరికరం ప్రాజెక్టుతో దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో పలువురు శాస్త్రవేత్తలను ఆకర్షించిందని ఆయన తెలిపారు. విజయవాడలో నిర్వహించిన దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో దక్షిణ భారత దేశానికి చెందిన ఆరు రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా నుంచి సాయి స్వాతిక్ నిర్వహించిన ప్రాజెక్టు ఇందులో ప్రదర్శించారు. ప్రాజెక్టు రెండవ బహుమతిగా విద్యార్థి విజేతగా ఎంపిక కావడం విశేషం. ప్రతిష్టాత్మక దక్షిణ భారతసైన్స్ ఫేర్‌లో జిల్లా నుంచి పాల్గొని రెండవ బహుమతికి ఎంపిక కావడం ఆనందకరమని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డిలు పేర్కొన్నారు. విజేతలను, గైడ్ టీచర్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను అభినందించారు.

'సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి'

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 24: ఈ నెల 15న గిరిజనులు ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో గిరిజన ఉద్యోగుల సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నాటి నుంచి సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా సెలవు దినంగా ప్రకటించాలని గత ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోలేదన్నారు. గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు రాముడునాయక్, బాలునాయన్, చిన్నకృష్ణానాయక్, దాసు, రాజునాయక్, సీతారాంనాయక్, భాషనాయక్, గోపినాయక్, రాజేష్‌నాయక్, రమేష్, కళ్యాణ్ పాల్గొన్నారు.

ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 2 : పెద్దకొత్తపల్లిలో గద్దర్ జయంతి వేడుకలను కళాకారులు ఘనంగా నిర్వహించారు. పెద్దకొత్తపల్లి బస్టాండ్ చౌరస్తాలో గద్దర్ చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాకారులు ఆటపాటలతో వేడుకలను నిర్వహించారు. కళాకారులు డి.రమాదేవి, తుపాకుల వెంకటేశ్, కే.నరసింహ, కేశవులు, యాదగిరి, పర్వతాలు, సలేశ్వరం, మహారాజు, సి.విష్ణు, మాలమహానాడు రాష్ట్ర నాయకుడు తగిలి వెంకటస్వామి, దళిత సంఘాల నాయకులు నరసింహ, బొల్లె స్వామి తదితరులు ఉన్నారు.

డీసీసీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

లింగాల, ఫిబ్రవరి 2 :జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ అచ్చంపేట బ్రాంచ్ మేనేజర్ శేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో బ్యాంక్ ద్వారా అందిస్తున్న సేవల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్‌లో సభ్యులుగా ఉన్న రైతులు బ్యాంక్‌లో ఖాతాదారులుగా చేరితే అనేక ప్రయోజనాలు చేకూరుతాయని అన్నారు. ముఖ్యంగా స్వల్ప ప్రీమియంతో బీమా సౌకర్యాన్ని పొందవచ్చని అన్నారు. అదే విధంగా తక్కువ వడ్డీతో పంటల రుణాలు, స్వయం ఉపాధి, ఉన్నత చదువులకై రుణాలు పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రైతులు పొందుతున్న పంటల రుణాలను సకాలంలో చెల్లించి పీఏసీఎస్ ఆర్థిక బలోపేతానికి దోహదపడాలని కోరారు. ఎఫ్‌వో మోహన్, సీఈవో పాండు, సూపర్‌వైజర్ వెంకటయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

16న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయండి

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 2: దేశ వ్యాప్తంగా కార్మికులు, రైతులు, కూలీలు ఎదుర్కొంటున్న అఖిల భారత సమ్మెతో పాటు గ్రామీణ భారత్ బంద్‌ను పాటించి జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ట్రాన్స్‌పోర్టు కార్మికులు జిల్లా రవాణా అధికారికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యంలో ఉపాధి కోల్పోయిన రవాణా రంగ కార్మికులను ఫిట్‌మెంటు చార్జీలు తగ్గించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ట్రాన్స్‌పోర్టు కార్మికులు కురుమయ్య, సుబ్బయ్య, అంజి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మామిడి పంటలో యాజమాన్యం, డ్రమ్ సీడర్‌పై అవగాహన

కొల్లాపూర్, ఫిబ్రవరి 2 : కొల్లాపూర్ మండల పరిధిలోని యన్మన్‌బెట్ల గ్రామంలోని రైతు వేదికలో మామిడి పంటలో యాజమాన్యం, వరిలో డ్రమ్ సీడర్‌పై రైతులకు పాలెం కేవీకే శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. శుక్రవారం రైతులకు ప్రస్తుత పరిస్థితుల్లో మామిడి పంటలో చేపట్టాల్సిన ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, పూత, పిందెపూత దశల్లో ఆశించే చీడపీడ నివారణ చర్యలపై పిందె పెరుగుల దశల్లో చేపట్టాల్సిన నీటి యాజమాన్య పద్ధతులపై కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఆదిశంకర్, కొల్లాపూర్ ఉద్యాన అధికారి లక్ష్మణ్ రైతులకు వివరించారు. అదేవిధంగా డ్రమ్ సీడర్ ద్వారా వరి పంట సాగు గురించి కొల్లాపూర్ డివిజన్ కేవీకే శాస్త్రవేత్త రామకృష్ణ, అగ్రికల్చర్ ఆఫీసర్ నాగరాజులు రైతులకు వివరించారు. ఆయిల్ పామ్ సాగు గురించి ఆయిల్‌పామ్ టెక్నికల్ మేనేజర్ ఫణికుమార్ రైతులకు వివరించారు. కొల్లాపూర్ ఏఈవో శ్రీకాంత్, ఆయిల్‌పామ్ క్లస్టర్ ఆఫీసర్లు మహేష్, అజయ్, యన్మన్‌బెట్ల సర్పంచ్ నాగరాజు, ఉప సర్పంచ్, సర్పంచ్, ఎంపీటీసీ భాస్కర్‌గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ కృష్ణ, వైస్ ఎంపీపీ నిరంజన్‌రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.